సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం। 20। జనవరి। 2023



ఆకట్టుకున్న ఒంటికాలు కాకి

జి.మాడుగుల: స్థానిక రామాలయం వీధిలో గురువారం దట్టమైన మంచులో ఒంటి కాలు కాకి చక్కర్లు కొట్టింది. ఇంటిపై వాలిన ఈ కాకిని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.



ఆశించిన ధరలు.. ఆనందంలో రైతులు

- రాజ్‌మాకు డిమాండ్
- కిలో రూ.75లతో విక్రయాలు ప్రారంభం

8లో



సారా కాస్తే ఏడేళ్ల జైలు

- సీఐ స్వామినాయుడు
- సురేంద్రపాలెంలో 3వేల లీటర్ల పులుపు ధ్వంసం

8లో

న్యూస్‌రీల్

విదేశీ వ్యవహారాల కమిటీ సమావేశానికి అరకు ఎంపీ మాధవి

కొయ్యూరు: ఢిల్లీలో జరిగే విదేశీ వ్యవహారాల కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు అరకు ఎంపీ గురువారం విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి వెళ్లారు.శుక్రవారం జరిగే సమావేశంలో పాల్గొంటారని ఎంపీ కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఎంపీ ఈ నెల 27 వరకు అందుబాటులో ఉండరని వారు పేర్కొన్నారు.

సిరులతల్లిని దర్శించుకున్న జయప్రద



అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహిస్తున్న సినీనటి జయప్రద

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మిని సినీనటి జయప్రద గురువారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయ ప్రకారం పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అర్చకులు అందజేశారు.

ఏయూ టీడీఆర్ హబ్ పోర్టల్ ప్రారంభం



పోర్టల్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లేనరీ హబ్ పోర్టల్(టీడీఆర్)ను వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి ప్రారంభించారు. వీసీ కార్యాలయంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏయూ టీడీఆర్ డీన్ జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రవేశాలు పొందిన పరిశోధకులు, రీసెర్చ్ గైడ్‌లు శనివారంలోగా తమ వివరాలు సమగ్రంగా పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పోర్టల్ ద్వారా రీసెర్చ్ గైడ్‌తో పరిశోధకులు ఎక్కడనుంచైనా తమ పరిశోధనకు సంబంధించిన ప్రగతిని చర్చించడం, వివరించడం సాధ్యపడుతుంది. దశలవారీగా పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ సేవలు అందించే వేదికగా ఈ పోర్టల్‌ను తీర్చిదిద్దుతామన్నారు. రెక్టార్ ఆచార్య కె.సమత తదితరులు పాల్గొన్నారు.

యాత్రి టికెట్ సువిధ కేంద్రం ప్రారంభం



ప్రయాణికుడికి మొదటి టికెట్ అందజేస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ప్రయాణికులకు రైల్వే సేవలను మరింత చేరువ చేసేందుకు రిజర్వుడ్, అన్ రిజర్వుడ్ టికెట్లను విక్రయించే రైల్వే అధీకృత ఏజెంట్ యాత్రి టికెట్ సువిధ కేంద్ర సేవలను డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి గురువారం ప్రారంభించారు. అనంతరం మొదటి టికెట్‌ను ప్రయాణికుడికి అందజేశారు. ఈ కేంద్రం ద్వారా రిజర్వుడ్ టికెట్లతో పాటు సాధారణ టికెట్లు కూడా తీసుకునే వెసులుబాటు ప్రయాణికుడికి కలుగుతుంది. మహారాణిపేట ప్రాంతంలో ఎనిమిదవ కేంద్రంగా నళిని యాత్రి సువిధ టికెట్ కేంద్రను ఏర్పాటుచేశారు. కనీసం రెండేళ్లు అధీకృత ఏజెంట్లుగా పనిచేసిన వారికి ఈ సువిధ కేంద్ర లైసెన్స్ రైల్వే పీపీపీ పద్ధతిలో మంజూరుజేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి, డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అవినాష్ శర్మ, అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ సర్కార్ పాల్గొన్నారు.

జనం ఇతివృత్తాలే వేమన పద్యాలు

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గురువారం మహాకవి యోగి వేమన జయంతి వేడుకలు జరిగాయి. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పలువురు అధికారులు వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ మాట్లాడుతూ పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పి, ప్రజలను మెప్పించిన మహాకవి వేమన అని అన్నారు.



చురుగ్గా జరుగుతున్న వైద్య కళాశాల ఆస్పత్రి విభాగం భవన నిర్మాణ పనులు

బ్లాక్‌ల వివరాలు (ఎఫ్ఎఫ్‌సీలో)

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి బ్లాక్ 6,87,211	మెడికల్ కళాశాల బ్లాక్ 2,86,205
నర్సింగ్ కళాశాల విభాగం 63,540	స్టాఫ్ క్వార్టర్లు, ఇతర నిర్మాణాలు 5,20,000

టార్గెట్ డిసెంబర్..!

- పాడేరులో శరవేగంగా వైద్య కళాశాల భవన నిర్మాణం
- ఇప్పటివరకు 25 శాతం పనులు పూర్తి
- రూ.500 కోట్లతో నిర్మాణం
- పతిష్టాత్మకంగా ప్రాజెక్టు

సాక్షి, పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరులో చేపట్టిన డాక్టర్ వైఎస్సార్ వైద్య కళాశాల నిర్మాణ పనులు జోరందుకున్నాయి. ఇప్పటికే అన్ని విభాగాలకు సంబంధించి 25 శాతం పనులు పూర్తయ్యాయి. ఇందుకు సుమారు రూ.70 కోట్లు వెచ్చించారు. ఎన్‌సీసీ నిర్మాణ సంస్థ ప్రతినిధులు ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరుకు పూర్తిచేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. చలిగాలులను తట్టుకుంటూనే సుమారు 500 మంది వరకు కూలీలు శ్రమిస్తున్నారు. స్థానిక తలారిసింగి ప్రభుత్వ ఆదర్శ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతంలో సుమారు 35 ఎకరాల విస్తీర్ణంలో రూ.500 కోట్లతో చేపట్టిన నిర్మాణ పనులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించడం తెలిసిందే. ఈ నిధుల్లో సగం కేంద్ర ప్రభుత్వం వెచ్చిస్తోంది.



పిల్లర్ల దశలో మెడికల్ కళాశాల భవనాలు

మూడు బ్లాక్‌ల్లో పనుల జోరు

మెడికల్ కళాశాల నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.ఇక్కడ పనులపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు స్థానిక అధికారులతో సమీక్షిస్తుంటారు.

- ప్రస్తుతం మెడికల్ కళాశాలకు సంబంధించి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవన నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.ఈ బ్లాక్‌లోని పలు భవన నిర్మాణాలు మూడవ అంతస్తుకు చేరుకున్నాయి. కొన్ని భవనాల నిర్మాణ పనులు మొదటి అంతస్తు దాటాయి. నర్సింగ్ కళాశాల విభాగానికి సంబంధించి ఒక బ్లాక్‌లో భవన **నిర్మాణం రెండవ అంతస్తు శ్లాబ్‌కు సిద్ధమైంది. ఇదే బ్లాక్‌లోని పలు భవనాల పనులు పిల్లర్ల స్థాయిలో ఉన్నాయి.**
- **ప్రధాన వైద్య కళాశాల బ్లాక్‌కు సంబంధించి ఎన్‌సీసీ ఇంజనీరింగ్ అధికారులు మరింత దృష్టి పెట్టారు. భూమిని చదును చేసి పిల్లర్లకు బాగా లోతుగా తవ్వే పనులకే చాలా సమయం పట్టింది.** ప్రస్తుతం ఆయా పనులన్నీ సజావుగా జరగడంతో పిల్లర్ల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి.

గడువులోగా పూర్తి చేస్తాం

చలితీవ్రత అధికంగా ఉన్నప్పటికీ ప్రతికూల వాతావరణంలోను నిర్మాణ పనులకు ఇబ్బందులు లేకుండా ఎన్‌సీసీ సంస్థ పనిచేస్తోంది. నాణ్యతలో రాజీ లేకుండా నిరంతరం తమ ఇంజనీరింగ్ అధికారులు కూడా నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు.నిర్మాణ సామగ్రి శాంపిళ్లను కూడా ల్యాబ్‌ల్లో నాణ్యత నిర్ధారణ పరీక్షలు జరిపిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈఏడాది డిసెంబర్ నెలాఖరుకు మొత్తం పనులన్నీ పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నాం. శీతాకాలం ముగియగానే పనులు మరింత వేగవంతం చేస్తాం.

– డీపీ నాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఏపీ ఎస్ఎంఐడీసీ

టెన్త్ విద్యార్థులకు అదనపు తరగతులు

- జిల్లా విద్యాశాఖాధికారి రమేష్
- హెచ్ఎంలకు సూచన



కొయ్యూరులో మాట్లాడుతున్న డీఈవో రమేష్

కొయ్యూరు: టెన్త్ విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ ఆదేశించారు. గురువారం స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాల వన్‌లో నిర్వహించిన హెచ్ఎంల సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. పదిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు వీలుగా ఉపాధ్యాయులు విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. దీనిపై ఉపాధ్యాయులు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యంచేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ ఉపాధ్యాయుడు ముఖ గుర్తింపు(ఫేషియల్ రికగ్నైజషన్) యాప్‌ను విధిగా వాడాలన్నారు. దీని ఆధారంగానే ఉపాధ్యాయులకు జీతాలు ఇస్తారని తెలిపారు. దీనిలో ఎలాంటి మినహాయింపులు లేవన్నారు. ఉపాధ్యాయులు సమయానికి వచ్చి గుర్తించిన ప్రదేశంలో ఉండి యాప్‌ను వాడాలని కోరారు.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు

విద్యార్థుల సంఖ్య అధారంగా ప్రభుత్వం పాఠశాలలకు గ్రాంట్ విడుదల చేస్తోందని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ తెలిపారు. రూ.40 వేల నుంచి ఏడున్నర లక్షల వరకు గ్రాంట్ వస్తుందని పేర్కొన్నారు. ఈ నిధులతో పాఠశాలలకు అవసరమైన చిన్న చిన్న మరమ్మతులు చేపట్టవచ్చన్నారు. ఉపాధ్యాయులు వాటికి సంబంధించిన వివరాలను పంపించాలని ఆయన ఆదేశించారు. దీని మూలంగా అనేక పాఠశాలల్లో నెలకొన్న చిన్న సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. సీఆర్ యాప్‌లో లోటుపాట్లు సరిచేయాలని ఆయన కోరారు.దీనికి తక్కువ సమయం ఉన్నందున వెంటనే స్పందించి సరిచేసుకోవాలని సూచించారు.ఎంఈవో బోడంనాయుడు పాల్గొన్నారు.



గంగవరం ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఈవో రమేష్

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

గంగవరం: పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు సబ్జెక్టు ఉపాధ్యాయులు తగిన కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ ఆదేశించారు. గురువారం ఆయన రంపచోడవరం డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. పాఠశాలలు, టెన్త్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. దీనిలో భాగంగా స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలోని టెన్త్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. కల్పించాల్సిన సౌకర్యాలపై పలు సూచనలు చేశారు. సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. కొత్తాడ కస్తూర్బా బాలికా విద్యాలయాన్ని సందర్శించిన ఆయన బాలికలకు అందుతున్న సౌకర్యాలు, బోధనపై ఆరా తీశారు. ప్రధానోపాధ్యాయులు ఝాన్సీహేన్సన్, లక్ష్మి, సీఆర్పీలు విజయభాస్కర్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు వ్యవసాయోత్పత్తుల కొనుగోలు

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- ముళ్లుమెట్ట గ్రామ సందర్శన



ముళ్లుమెట్టలో గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



ముళ్లుమెట్ట గ్రామంలో కాఫీ, మిరియాల తోటలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

హుకుంపేట: గిరి రైతుల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను మద్దతు ధర కొనుగోలు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని తడిగిరి పంచాయితీ ముళ్ళుమెట్ట గ్రామంలో పర్యటించారు. గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులు పండించే కాఫీ, పసుపు, అల్లం, పిప్పలమోడితో పాటు సీజన్‌లో పండించే ప్రతీ పంటను జీసీసీ కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామన్నారు. దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. రోడ్డు, తాగునీరు సౌకర్యం కల్పించాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయాలని గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. సర్పంచ్ రంజిత్, వైస్ సర్పంచ్ రామారావు, కాఫీ సబ్ అసిస్టెంట్ బాలంనాయుడు, సిబ్బంది శ్రీను పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులతో ఆర్థికాభివృద్ధి

కేవీకే కోఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ లలితా కామేశ్వరి



విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

రంపచోడవరం: స్థానికంగా లభించే వనరులతో విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త డా. లలితాకామేశ్వరి సూచించారు. పందిరిమామిడి కేవీకేలో గురువారం చేపలు,రొయ్యలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. జాతీయ మత్స్యఅభివృద్ధి మండలి, హైదరాబాద్ వారి ఆర్థిక సహకారంతో ఈ శిక్షణ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీలోని పర్యాటక రంగం ఎంతో అభివృద్ధి చెందుతున్నందున చేపలు, రొయ్యలతో తయారు చేసిన విలువ ఆధారిత పదార్థాలకు మంచి గిరాకీ ఉందన్నారు. వాటిని తయారు చేసి మార్కెట్ చేసుకోవాలని సూచించారు. చేపలు,రొయ్యలతో విలువధారిత పదార్థాల తయారీకి ఇస్తున్న శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు కేవీకే ద్వారా తగిన కృషి చేస్తామన్నారు. వైఎస్సార్ ఉద్యాన పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త కె.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఏజెన్సీలో చాలా చోట్ల చెరువులు ఉన్నాయన్నారు. తక్కువ ధరకు లభించే చేపలతో విలువ ఆధారిత పదార్థాలు తయారు చేసుకుని మార్కెట్ చేసుకోవాలని సూచించారు. జాతీయ మత్స్య సాంకేతిక సంస్థ శాస్త్రవేత్త అహ్మద్‌బాషా చేపలు, రొయ్యలు నిల్వ చేసుకునే విధానాలు, చేప, రొయ్య పచ్చళ్లు, అప్పడాలు, సమోసాలు తయారీపై అవగాహన కల్పించారు. ఏజెన్సీలో కోతులు పంటలను పాడు చేస్తున్నందున చేపలు, రొయ్యల పెంపకాన్ని చేపట్టాలని పీహెచ్‌వో కె.చిట్టిబాబు సూచించారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ రాజ్‌కిషోర్ మాట్లాడుతూ ముద్ర పథకం ద్వారా కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు తోడ్పాటు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డా. ఎస్.ఆదర్శ, డా. క్రాంతికుమార్, డా. ప్రవీణ్‌బాబు, డా.ఎస్ చిరంజీవి, పి.రాజశేఖర్, కె.వీరాజంనేయులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఉచిత 'గుండె' శస్త్రచికిత్స



విశాఖ కలెక్టర్ మల్లికార్జునకు ఒప్పంద ప్రతాలు అందజేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): పుట్టుకతో వచ్చే గుండె వ్యాధుల గల పిల్లలకు ఉచితంగా శస్త్ర చికిత్సలు అందించే ప్రక్రియకు జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, సాయి స్వస్థ వెల్‌నెస్ సెంటర్(ఎంవీపీ కాలనీ), రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) మధ్య గురువారం ఒప్పందం జరిగింది. ఈ ఒప్పంద పత్రాలను డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వి.సమత, సాయి స్వస్థ వెల్‌నెస్ సెంటర్ ప్రతినిధి కలెక్టర్ మల్లికార్జునకు అందజేశారు. కేజీహెచ్‌లో డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ ద్వారా గుర్తించిన కేసులను సాయి స్వస్థ వెల్‌నెస్ సెంటర్‌కు రిఫర్ చేస్తారు. అక్కడ గుండె వైద్య నిపుణులు ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి సిద్దిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తారని డీఎంహెచ్‌వో వెల్లడించారు.

ప్రమాద బీమాపై నేటి నుంచి స్పెషల్ డ్రైవ్

అరకు సబ్ డివిజన్ పోస్టల్ ఐపీవో ఉపేంద్ర

ముంచంగిపుట్టు: యాక్సిడెంట్ గార్డ్ ఇన్సూరెన్స్ పాలసీపై ఈనెల ఈనెల 20,21 తేదీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు అరకు సబ్ డివిజన్ పోస్టల్ ఐపీవో బి.ఉపేంద్ర తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యాక్సిడెంట్ సంభవించినప్పుడు హాస్పిటలైజేషన్‌కు అనుకూలంగా ఎక్కువ మంది వ్యక్తులను కవర్ చేసేలా టాటా ఏఐజీ సంస్థతో కలిసి ఇండియా పోస్ట్ గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకువచ్చిందన్నారు. ఏడాదికి రూ.399 చెల్లిస్తే రూ.10 లక్షల బీమా పొందవచ్చునన్నారు. స్పెషల్ డ్రైవ్ ముంచంగిపుట్టు,పెదబయలు మండల కేంద్రాల్లో నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.



రాజవొమ్మంగి మండలం అప్పలరాజుపేటలో దట్టంగా కురుస్తున్న మంచు

కొనసాగుతున్న చలిగాలులు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో చలిగాలులు కొనసాగుతున్నాయి. మంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు. గురువారం పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 11 డిగ్రీలు, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 14.3 డిగ్రీలు, అరకులోయ కాఫీబోర్డు వద్ద 14.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రాజవొమ్మంగి: మండలంలో గురువారం ఉదయం 9 గంటల వరకు పొగమంచు దట్టంగా కురిసింది. మరోపక్క చలితీవ్రత ఎక్కువగా ఉంటోంది. ఉపశమనం పొందేందుకు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. రోడ్లను మంచు తెరలు కమ్మేయడంతో ప్రయాణం సాగడం లేదని వాహన చోదకులు వాపోతున్నారు. రాజవొమ్మంగి నుంచి విశాఖపట్నం కారులో వెళ్లేందుకు 4 గంటల సమయం పడుతుందని, మంచు తెరలు కారణంగా 6 గంటలు పడుతున్నట్లు వాహనచోదకులు తెలిపారు. కొయ్యూరు, రాజవొమ్మంగి ప్రాంతాలకు వచ్చి వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసులు అరగంట ఆలస్యంగా తిరుగుతున్నాయి.



అరకులోయలో ఉదయం 9 గంటలకు దట్టంగా కురుస్తున్న పొగమంచు

రైస్ పుల్లింగ్ ముఠా గుట్టురట్టు

- బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు
- ముగ్గురి అరెస్టు
- మూడు కార్లు, రూ.7,87,500 నగదు, కత్తి స్వాధీనం
- మిగతా నిందితులను పట్టుకుంటాం: చింతపల్లి ఏఎస్పీ ప్రశాంత్ కిషోర్



పట్టుబడిన నిందితులతో ఏఎస్పీ ప్రతాప్ కిషోర్, ఎస్ఐలు

చింతపల్లి రూరల్: ఏజెన్సీలో రైస్ పుల్లింగ్ పేరుతో ప్రజలను మోసం చేస్తున్న ముఠాలో కొంతమందిని అరెస్టు చేశామని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ కిషోర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం ఆయన వెల్లడించారు.

రూ.కోట్లు సంపాదించవచ్చని ఆశ చూపుతూ..

అరకులోయ మండలం చినబలడ పంచాయతీ మాలసింగారం గ్రామానికి చెందిన వంతల పూర్ణ, వంతల బాజీనుద్దీన్, వంతల మనోజ్, పొట్టి రామదాసు, ప్రమోద్‌తో పాటు చింతపల్లి మండలం లోతుగెడ్డ పంచాయితీ తురంతంపాడు గ్రామానికి చెందిన కొర్ర ప్రేమ్ కుమార్ తదితరులు పురాతన నాణేలు అమ్ముతున్నామని, వాటిని తిరిగి అమ్ముకుంటే రూ.కోట్లు సంపాదించవచ్చని ఆశ చూపిస్తున్నారు.

పథకం ప్రకారం ఎరవేసి..

తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట మండలం మన్యంవారిపాలెం గ్రామానికి చెందిన కసిరెడ్డి రాజేశ్వరరావుకు ముఠా సభ్యులు ఎరవేశారు. దీంతో సోమవారం రాజేశ్వరరావుతో పాటు అతని పార్టనర్లు చిన్న అప్పారావు, వసంత్‌కుమార్ కలిసి తురుతుంపాడు గ్రామంలో ఉన్న కొర్ర ప్రేమ్‌కుమార్ ఇంటికి నాణెం కొనేందుకు రూ.8 లక్షలు తీసుకుని వెళ్లారు. ఈ విషయం అతను ముఠా సభ్యుడైన పూర్ణకు తెలపడంతో పథకం రచించాడు. వెంటనే ముఠాలో సభ్యులైన మనోజ్, ప్రమోద్, బుజ్జిని కారులో లోతుగెడ్డ జంక్షన్ సమీపంలోకి పంపించి ఉంచాడు. వారిలో ప్రమోద్, బుజ్జి పోలీసు యూనిఫాం ధరించారు. ఆ తరువాత పూర్ణ, ముఠా సభ్యుడు రామదాసు మరో కారులో ప్రేమ్‌కుమార్ ఇంటికి వెళ్లారు. అక్కడినుంచి వారు లోతుగెడ్డ సమీపంలో వేచి ఉన్న సభ్యుల వద్దకు కారులో బయలుదేరారు. కొంత దూరం వచ్చేపరికి ప్రమోద్, బుజ్జిలు నాణెం కొనుక్కొనేందుకు వచ్చిన వారి కారును ఆపారు. తాము పోలీసులమని చెప్పి, కారు రికార్డులు చూపించమని అడిగారు. అదే సమయంలో ముఠా సభ్యులంతా ఏకమై వారిని చుట్టుముట్టారు. చంపేస్తామని కత్తితో బెదిరించి వారి నుంచి 7,87,500 నగదుతో ఉన్న బ్యాగ్‌ను లాక్కొన్నారు. రాజేశ్వరరావు కారు తాళాలను తుప్పల్లో పడేసి అక్కడి నుంచి పరారయ్యారు.

బాధితుడి ఫిర్యాదుతో..

బాధితుడు రాజేశ్వరరావు బుధవారం చింతపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ముఠా సభ్యుల కదలికలపై నిఘా పెట్టారు. ఇంటికి వచ్చిన వెంటనే ముఠా సభ్యులైన పూర్ణ, ప్రేమ్‌కుమార్, బుజ్జిని ఎస్ఐలు రమణ, అరుణ్‌కుమార్ సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. వారి నుంచి మూడు కార్లు, నగదు రూ.7,87,500, కత్తి, రెండు యూనిఫాం ఫ్యాంట్లు, రాగి పురాతన నాణెంను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ముఠా సభ్యుల్లో మరో ముగ్గురిని పట్టుకుంటామని ఏఎస్పీ ప్రతాప్ కిషోర్ తెలిపారు. నాణేలకు ఎటువంటి శక్తులు ఉండవని, ఇటువంటి ముఠాలను ఆశ్రయించి మోసపోవద్దని ఆయన పేర్కొన్నారు. ఎస్‌బీ ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సారా కాస్తే ఏడేళ్ల జైలు

- సీఐ స్వామినాయుడు
- సురేంద్రపాలెంలో 3వేల లీటర్ల పులుపు ధ్వంసం

కొయ్యూరు: రాజేంద్రపాలెం పంచాయతీ సురేంద్రపాలెంలో గురువారం ఆపరేషన్ పరివర్తన్‌లో భాగంగా మూడువేల లీటర్ల సారా పులుపును పోలీసులు ధ్వంసం చేశారు. సురేంద్రపాలేనికి సమీపంలో సారా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ రాజారావు,మహిళా పోలీసులు, ఏపీఎస్‌పీ సిబ్బంది కలిసి సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. అక్కడ నిల్వ ఉంచిన సారా పులుపును ధ్వంసం చేశారు. పులుపుతో పాటు 20 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. అనంతరం సీఐ గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. సారా ఎవరు కాసినా లేదా విక్రయించినా చర్యలు తీపుకుంటామని హెచ్చరించారు. పులుపుతో పాటు దానిని నిల్వ ఉంచిన వంట సామగ్రిని ధ్వంసం చేశామని వారికి తెలిపారు.ఇక నుంచి గ్రామంలో ఎవరు సారా తయారు చేసినా కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తామన్నారు. ఏపీ ప్రొహిబిషన్ చట్టం ప్రకారం సారా కేసుల్లో కనీసం ఏడు సంవత్సరాల జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. తయారీదారులు పద్ధతి మార్చుకోకుంటే జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఆశించిన ధరలు.. ఆనందంలో రైతులు


వ్యాపారులు రవాణాకు సిద్ధం చేసిన రాజ్‌మా బస్తాలు


సంతలో విక్రయానికి తీసుకొచ్చిన రాజ్‌మా

- రాజ్‌మాకు డిమాండ్
- కిలో రూ.75లతో విక్రయాలు ప్రారంభం

జి.మాడుగుల: మన్యంలో గిరిజన రైతులు సాగు చేస్తున్న రాజ్‌మా (ఎరుపు చిక్కుళ్లు) గిట్టుబాటు ధర లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన రైతు భరోసా పథకం ఈ పంటకు కూడా ఊతమిచ్చింది. గిరిజన ప్రాంతాల్లో పోడు భూములు, ఏటవాలు భూముల్లో రాజ్‌మా పంట వేశారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో రైతులు రాజ్‌మా సాగు చేశారు. గత ఏడాది మార్కెట్ కంటే ఇప్పుడు రాజ్‌మా చిక్కుళ్లకు మంచి ధరలు పలుకుతున్నాయి. రాజ్‌మా చిక్కుళ్లు మంచి పోషక విలువలు ఉండడంతో ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఏజెన్సీ రాజ్‌మాకు మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. ఏజెన్సీ వ్యాప్తంగా జరిగే వారపు సంతల్లో అధికంగా రాజ్‌మా చిక్కుళ్ల వ్యాపారం జరుగుతుంది. రాజ్‌మా చిక్కుళ్లకు డిమాండ్‌తో పాటు ధర కూడా ఉండటంతో వీటిని కొనుగోలు చేయటానికి వ్యాపారులు ఎగబడుతున్నారు. జి.మాడుగులలో వారపు సంతలో కిలో రాజ్‌మా(ఎరుపు) చిక్కుళ్లను రూ.75 ధరతో వ్యాపారులు కొనుగోలు చేశారు. దీంతో రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. రాజ్‌మా చిక్కుళ్లకు మిగిలిన వారపు సంతల్లో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. పాడేరు డివిజన్‌లో 10,591హెక్టార్లల్లో రైతులు రాజ్‌మా పంట వేశారు. గంజాయి పంట నిర్మూలనకు, ప్రత్యామ్నాయ పంటగా ప్రభుత్వం ఈ ఏడాది 90శాతం సబ్సిడీతో రైతులకు రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేసింది. జి.మాడుగుల మండలంలో 3,400 ఎకరాల్లో రాజ్‌మా పంట వేశారు. రాజ్‌మా చిక్కుళ్లకు డిమాండ్‌తో పాటు ధర పలుకుతుండటంతో రైతుల ఇంట సిరుల పంటగా మారింది.

ధర బాగుంది

గత సంవత్సరం కంటే ఈ ఏడాది ధర బాగుంది. వారపు సంత మార్కెట్‌లో రాజ్‌మా ఎరుపు చిక్కుళ్లను కిలో రూ.75 ధరతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

– **రాజుబాబు**, రైతు, గడుతూరు గ్రామం

మంచి దిగుబడి

ఈ ఏడాది ప్రభుత్వం 90శాతం సబ్సిడీపై రాజ్‌మా విత్తనాలు సకాలంలో రైతులకు అందించి పోత్సహించింది. గంజాయి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలో పలు పంచాయతీల్లో గిరిజన గ్రామాలను గుర్తించి విత్తనాలు అందించాం. వాతావరణం అనుకూలించడంతో రైతు ఆశించిన రాజ్‌మా పంట దిగుబడి వచ్చింది.

–ఎల్.ఆర్.బి.పాత్రుడు, ఏవో, జి.మాడుగుల

పశు వైద్యశాఖ రాయితీలతో ప్రయోజనం

వ్యవసాయ శాఖ జేడీ ప్రసాద్

మాడుగుల: ప్రభుత్వం పశువైద్యశాఖ ద్వారా ఎన్నడూ లేని విధంగా అందిస్తున్న రాయితీలు ప్రతి పాడి రైతు సద్వినియోగం చేసుకుని అధిక లాభాలు పొందాలని జిల్లా పశువైద్య శాఖ సంయుక్త సంచాలకుడు బి.ప్రసాద్ అన్నారు. మండలంలో జేడీపేట గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత పశు గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా రాయితీలపై అందిస్తున్న సంపూర్ణ మిశ్రమ దాణా, సెక్స్ సార్టెడ్ సెమన్‌లు వినియోగంతోపాటు మినరల్ మిక్చర్ మందులు, ఎదకు రాని పశువుల గురించి రైతులకు పూర్తి స్థాయిలో వివరించారు. వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి చొరవతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 36 ఎదకురాని పశువులకు, 21 చూడి పశువులకు, 60 పాడి పశువులకు, 204 గొర్రెలు, మేకలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ బి.రామ్మోహనరావు, సహాయ సంచాలకులు వి. చిట్టినాయుడు, పశువైద్యాధికారులు మణిలక్ష్మణ్, భానుబాబు, బి.సంధ్య, జి.నూకేశ్వరరావు, అరుణకుమార్, వీఎల్‌వో సత్యం, పశువైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.


జేడీపేటలో పశువైద్య శిబిరం ప్రారంభిస్తున్న వ్యవసాయ శాఖ జేడీ ప్రసాద్, వైస్ ఎంపీపీ రాజారామ్, సర్పంచ్ కృష్ణమూర్తి

అదృశ్యమైన యువకుడు బావిలో పడి మృతి


నర్సింహమూర్తి

కె.కోటపాడు : అదృశ్యమైనట్టు భావిస్తున్న దాలివలస గ్రామానికి చెందిన ఆదిరెడ్డి నర్సింహమూర్తి(22) గురువారం గ్రామం సమీపాన గల కొండ దిగువన గల బావిలో శవమై కనిపించాడు. ఈ నెల 17 నుంచి ఇంటి నుండి వెళ్లిపోయిన నర్సింహమూర్తి ఆచూకీ కోసం కుటుంబసభ్యులు, స్నేహితులు వెతకడంతో పాటు ఎ.కోడూరు పోలీస్‌స్టేషన్‌లో సోదరుడు పూర్ణచంద్రరావు ఫిర్యాదును చేశాడు. ఈ నేపథ్యంలో బావిలో నర్సింహమూర్తి శవమై నీటిపై తేలియాడడం చూసిన స్థానికులు సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. ఇటీవల కాలంలో నర్సింహమూర్తికి మతి స్థిమితం సమంగా లేనట్టుగా సోదరుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలోనే బావిలో పడి నర్సింహమూర్తి మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతిపై కె.కోటపాడు ఎస్.ఐ ధనుంజయ్ కేసును నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. అనకాపల్లి ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. పెద్ద కుమారుడు నర్సింహమూర్తి మృతితో తల్లిదండ్రులు తాతంనాయుడు, దేముడమ్మ బోరున విలపించడంతో స్థానికులను కంటతడి పెట్టించింది.

ప్రమాదవశాత్తూ మేడపై నుంచి పడి అటెండర్ మృతి


మృతుడు రాజు నాయుడు(ఫైల్)

నర్సీపట్నం : నర్సీపట్నం పంచాయతీరాజ్ కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్న ఎం.రాజునాయుడు(57) ప్రమాదవశాత్తు మేడపై నుండి పడి మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. కార్యాలయం ఆవరణలో ఏపుగా పెరిగిన బూరుగు వృక్షాలను తొలగించే సమయంలో గురువారం ఈ సంఘటన జరిగింది. నరికిన చెట్లు కార్యాలయంపై పడకుండా పక్కకు పడేందుకు వీలుగా చెట్టుకు తాడు కట్టి ఆ తాడును స్లాబ్‌పై పిల్లర్‌కు కట్టారు. కూలీలు చెట్టు నరుకుతుండగా అటెండర్ పిల్లర్ కట్టిన తాడును పట్టుకుని లాగుతున్నాడు. నరికిన చెట్టు బలంగా పక్కకు లాగడంతో అటెండర్ తూలి మేడపై నుండి కిందపడిపోయాడు. దీనితో తలకు బలమైన గాయం కావడంతో కార్యాలయ అధికారులు, సిబ్బంది సమీపంలోని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. టౌన్ ఎస్ఐ గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు దీపక్ చక్రి



పాయకరావుపేట: ఈ నెల 13, 14 వ తేదీలలో విజయవాడ జిల్లా గన్నవరం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో జరిగిన 44 వ రాష్ట్ర స్థాయి జూనియర్ (బాలుర) హ్యాండ్ బాల్ పోటీలలో శ్రీ ప్రకాష్ విద్యార్థి జి.దీపక్ చక్రి (10 వ తరగతి) అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికై, ఈ నెల 26 నుండి 31 వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం తిరుచురాపల్లి లో జరిగే 44 వ జూనియర్ (బాలుర) జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనన్నున్నాడని ప్రధానోపాధ్యాయుడు డి.వి.శ్రీనివాస్ తెలియజేశారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని విద్యా సంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, కోచ్‌లు బాలరాజు, సురేష్ అభినందించారు.

విక్టోరియా ఆస్పత్రిలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషా తెలిపారు. ఈసీజీ టెక్నీషియన్ ఒక పోస్టు రోస్టర్ పాయింట్ ప్రకారం భర్తీ చేస్తామన్నారు. ఈనెల 27 లోపు దరఖాస్తులను తమ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలు https@//visakhapatnam.ap.gov.i n వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

దారుణ హత్యపై దర్యాప్తు

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ గౌతమి సాలి
- త్రీడీ స్కానర్‌తో ఫోరెన్సిక్ బృందం దర్యాప్తు
- హతుడి మరో కాలు, చెయ్యి లభ్యం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమి సాలి

యలమంచిలి: యలమంచిలి పట్టణ పరిధిలో కట్టుపాలెం చెరకు కాటా ఊసల మదుం వంతెన కింద బయటపడిన వ్యక్తి దారుణ హత్యకు సంబంధించి పోలీసుశాఖ దర్యాప్తు వేగవంతం చేసింది. ఈనెల 15న వంతెన కింద ఉన్న కాలువలో వ్యక్తి తల, మొండెం,కొన్ని శరీర భాగాలు వేర్వేరుగా లభించిన సంగతి తెలిసిందే. గుర్తు తెలియని వ్యక్తిని కొందరు అతి కిరాతకంగా శరీర భాగాలు వేరు చేసి హత్యకు పాల్పడిన ఘటన ఈ ప్రాంతంలో సంచలనం కలిగించింది. ఈ దారుణ హత్య మిస్టరీని ఛేదించడానికి పోలీసు ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో హంతకులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటివరకు హత్యకు సంబంధించిన కీలకమైన ఆధారాలేమి లభించకపోవడంతో గురువారం హతుడి శరీర భాగాలు బయటపడిన ప్రాంతాన్ని అనకాపల్లి ఎస్పీ గౌతమి శాలి , ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్సు ల్యాబ్ బృందం పరిశీలించారు. త్రీడీ స్కానర్ తో హత్యకు సంబంధించి ఆధారాల కోసం అన్వేషించారు. యలమంచిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ గఫూర్, ఎస్ఐ కె.సన్నిబాబు హత్యకు సంబంధించి ఇప్పటివరకు సేకరించిన వివరాలను ఎస్పీకి తెలిపారు .ఈ ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా చేపడుతున్నామని వీలైనంత త్వరగా మిస్టరీని ఛేదిస్తామని ఎస్పీ తెలిపారు.

మరో కాలు, చెయ్యి లభ్యం

హతుడి శరీర భాగాలు గుర్తించిన ప్రదేశంలో వెతికించగా హత్యకు గురయిన వ్యక్తికి సంబంధించిన మరో కాలు, చెయ్యి భాగాలు లభించాయి. ఇప్పటికే వెలికి తీసిన హతుడి శరీర భాగాలను అనకాపల్లి మార్చురీలో భద్రపరిచి గురువారం లభించిన కాలు చెయ్యి శరీర భాగాలను కూడా అనకాపల్లి మార్చురీ లోనే భద్రపరిచి ఉంచుతామని పోలీసులు తెలిపారు. మరో వైపు హతుడి తల భాగం ఆధారంగా రూపొందించిన ఛాయా చిత్రాన్ని రాష్ట్రంలో ఉన్న అన్ని పోలీస్‌స్టేషన్‌లకు పంపించారు. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదయిన వ్యక్తుల అదృశ్యం కేసులు వివరాలు ఆధారంగా ఈ హత్య కేసును ఛేదించే పనిలో పోలీసులు ఉన్నారు.

అన్ని నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న జేసీఎస్ ఉత్తరాంధ్ర జిల్లాల కోఆర్డినేటర్ హర్షవర్ధన్‌రెడ్డి

- ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించే బాధ్యత మనదే..
- ఉత్తరాంధ్ర జిల్లాల జేసీఎస్ కోఆర్డినేటర్ హర్షవర్ధన్ రెడ్డి
- విశాఖ, అల్లూరి జిల్లాల జేసీఎస్ మండల కన్వీనర్ల సమావేశం


మండల కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల

సాక్షి, విశాఖపట్నం: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలందించే బాధ్యత మనపైనే ఉందని ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్ సీపీ జేసీఎస్(జగనన్న సచివాలయం కన్వీనర్స్ అండ్ గృహ సారథి) కో–ఆర్డినేటర్ హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ సీపీ విశాఖ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జేసీఎస్ మండల కన్వీనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే దమ్ములేక ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై.. ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ఈ ముష్కరుల ముప్పేటదాడిని తిప్పికొట్టడంతో పాటు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్త భుజాన వేసుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు చేరవేసేలా.. గ్రామ సారథులు, కన్వీనర్ల నియామకానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో పార్టీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలతో మరింత మమేకమయ్యే విధంగా .జేసీఎస్ కన్వీనర్ల నియామకం జరిగిందన్నారు. మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించడంతో పాటు పార్టీ బలోపేతానికి సచివాలయ కన్వీనర్లు, కో–కన్వీనర్లు, గృహ సారథులు పనిచేయాలని కోరారు. కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, సమన్వయకర్తలు కె.కె రాజు, అక్కరమాని విజయనిర్మల, నియోజకవర్గాల పరిశీలకులు ఎస్.ఎ.రెహ్మాన్, బొడ్డేటి ప్రసాద్, చిక్కాల రామారావు, చొక్కాకుల వెంకటరావు, కొండేపల్లి కొండలరావు, కర్రి పాపారాయుడు, ముఖ్య నాయకులు అక్కరమాని వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు

- ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్


శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగ నియామక ప్రతాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: నైపుణ్య శిక్షణతో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు పొందవచ్చని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం స్కిల్ హబ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తూ గురువారం ఆయన నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 30 మందిలో 23 మంది యువతీ యువకులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. మిగిలిన వారికి వారంలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్ ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. మెగా జాబ్ మేళాలను ఏర్పాటు చేయాలని నైపుణ్య సంస్థ అధికారులకు సూచించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఛాముండేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి అవకాశాలను మరింత మెరుగు పరిచేందుకు వీలుగా యలమంచిలి, పాయకరావుపేట, చోడవరం, మాడుగులలో స్కిల్ హబ్ సెంటర్లను త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్లు తమరాన అప్పలనాయుడు, గొలుసు నర్సింహమూర్తి, పార్టీ పట్టణాధ్యక్షుడు ఏకా శివ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎ.రాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి 40 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల: మండలంలో ఎల్. పొన్నవోలు పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ వేగేసిన ప్రభాకరరాజు (చిన్ని), వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ గండి పడాల శ్రీనివాసరావు, పార్టీ అధ్యక్షుడు జోగాడ లక్ష్మణరావుల ఆధ్వర్యంలో గురువారం దేవరాపల్లి మండలం తారువ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు సమక్షంలో చేరారు. టీడీపీ నుంచి చేరిన వారిలో మాజీ సర్పంచ్ ఎదిరి ఈశ్వరరావు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎదిరి అప్పారావు, 4, 5వ వార్డు మెంబర్లు కోన చిలుకమ్మ, రాజాన పైడి తల్లమ్మ, పాల సంఘం డైరెక్టర్లు రాజాన అప్పారావు, చామంతుల కృపరాజు, పాల సంఘం మాజీ అధ్యక్షుడు చామంతుల చిన్నబ్బాయి, మాజీ డైరెక్టర్లు రాజాన సోమరాజు, సియ్యాద్రి చిన్నారావులతోపాటు 31 కుటుంబాలకు చెందిన వారు ఉన్నారు. వీరికి పార్టీ కండువాలు కప్పి డిప్యూటీ సీఎం సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని, ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎదిరి అప్పారావు, ఎదిరి ఈశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలతోపాటు గ్రామాభివృద్ధిని చూసి పార్టీలో చేరామన్నారు. జాలంపల్లి సర్పంచ్ దారా మల్లేశ్వరి చిన్ని, మాజీ వార్డు మెంబరు గొర్లి అప్పలనాయుడు పాల్గొన్నారు.

తాండవలో 4.20 లక్షల చేప పిల్లల విడుదల


తాండవ జలాశయంలో చేప పిల్లలు వేస్తున్న దృశ్యం

గొలుగొండ: తాండవ జలాశయంలో చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులు మంచి ఆదాయం పొందాలని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి తెలిపారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో గురువారం తాండవ జలాశయంలో 4.20 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ముగ్గురు జాలర్లకు మోటార్లు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ తాండవ జలాశయంపై రైతులే కాకుండా వందలాది మంది జాలర్లు ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. జాలర్ల అభివృద్ధికి మత్స్యశాఖ, ప్రభుత్వం అనేక రాయితీలపై చేప, రొయ్య పిల్లలు వేస్తున్నాయన్నారు. వీటితో జాలర్లకు మంచి ఆదాయం వస్తుందన్నారు. చిన్న పిల్లలను కాకుండా పెద్ద చేపలు పట్టుకునే విధంగా సంఘం ప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. జాలర్లు పట్టుకున్న చేపలను గ్రామాల్లో అమ్ముకోవడానికి రాయితీపై మోటారుసైకిళ్లు ఇచ్చామన్నారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ జక్కు నాగమణి, సర్పంచ్ పెదిరెడ్ల లక్ష్మి, పార్టీ యూత్ అధ్యక్షుడు రామకృష్ణ నాయుడు, తాండవ జలాశయం సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నక్కా రమణ, జొన్నా రాంబాబు, మత్స్యశాఖ అధికారి ఆశాజ్యోతి పాల్గొన్నారు.

పాత టైర్ల దుకాణంలో అగ్ని ప్రమాదం

గాజువాక : స్థానిక శ్రీనగర్‌లోని సివిల్ సప్‌లైస్ గోడన్ల సమీపంలో గల ఒక పాతటైర్ల దుకాణంలో గురువారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వంట కోసం కర్రల పొయ్యి వెలిగించడానికి పెట్రోల్ పోయడంతో ఈ సంఘటన చోటుచేసుకున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. సతేందర్ కుమార్ యాదవ్ అనే వ్యక్తి శ్రీనగర్‌లోని సివిల్ సప్‌లైగోడన్ల వద్ద పెట్రోల్ బంక్‌ను ఆనుకొని పాతటైర్ల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇద్దరు సిబ్బందిని నియమించుకొని పాత టైర్లకు పంక్చర్లు వేయడంతోపాటు రీబటనింగ్ పనులను నిర్వహిస్తున్నాడు. అందులోనే వంట చేసుకోవడం కోసం గురువారం కట్టెల పొయ్యి వెలిగించారు. అది మండటం కోసం అందులో పెట్రోల్ పోయడంతో ఒక్కసారిగా మంట పైకి వచ్చి అక్కడి పాతటైరుకు అంటుకుంది. ఆ మంట క్షణాల్లో మొత్తం దుకాణమంతా విస్తరించింది. దీంతో దట్టమైన పొగతో కూడిన మంటలు ఎగసిపడ్డాయి. పొగలు ఆ ప్రాంతాన్ని కమ్మేశాయి. సంఘటన చోటుచేసుకున్న దుకాణానికి ఆనుకొని పెట్రోల్ బంక్ కూడా ఉండటంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు.